సాక్షి
బాపట్ల
సోమవారం ¦ 4 ¦ మార్చి ¦ 2024



దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మాఘ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 515.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

బండ్లమ్మకు ప్రత్యేక పూజలు



చందోలు(పిట్టలవాని పాలెం): మండలంలోని చందోలులో ఉన్న బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు జరిపించారు.

న్యూస్‌రీల్

శ్రీశైలం మల్లేశ్వరస్వామి తలపాగా ఊరేగింపు



మంగళగిరి: నగరంలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీశైలం మల్లేశ్వరస్వామి వారి తలపాగా ఊరేగింపు కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా లావేరు గ్రామానికి చెందిన దేవాంగ సోదరులు భక్తిశ్రద్ధలతో శ్రీశైలంలోని మల్లేశ్వరస్వామి వారికి చేనేత తలపాగా నేయడం ద్వారా స్వామివారి కృపకు పాత్రులు అవుతున్నారన్నారు. 365 రోజులకు ఒక మూర చొప్పున భక్తిశ్రద్ధలతో, ఉపవాస దీక్షలతో స్వామివారికి తలపాగా నేస్తున్నారని పేర్కొన్నారు. ఆ తలపాగా నేయడం పూర్తయిన తరువాత దానిని శ్రీశైలంలోని స్వామివారి వద్దకు తీసుకువెళుతూ మార్గ మధ్యలో మంగళగిరి నగరంలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నగర పురవీధుల్లో ఊరేగించడం మంగళగిరి ప్రజల అదృష్టంగా భావించాలన్నారు. దేవస్థాన అధికారులు, ట్రస్టుబోర్డు సభ్యులు, దేవాంగ ప్రముఖులు పాల్గొన్నారు.

జిల్లాలోకి కేంద్ర బలగాలు రాక



నగరంపాలెం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా కేంద్ర బలగాలు జిల్లాకు భారీ సంఖ్యలో చేరుకున్నాయి. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు సబ్ డివిజన్లలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం కవాతు నిర్వహించారు. సీఐఎస్ఎఫ్, డీఎస్పీలు, స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బంది పట్టణాలు, గ్రామ, మండలాల్లో కలియ తిరిగారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు, శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ఈ కవాతును నిర్వహించారు. దక్షిణ, ఉత్తర, తూళ్లూరు సబ్ డివిజన్ల పరిధిలో కొనసాగింది.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తజనంతో కోలాహలంగా మారింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు టెన్త్ హాల్ టికెట్లు విడుదల

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 18 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థుల హాల్ టికెట్లు సోమవారం విడుదల కానున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లు అందుబాటులో ఉంటాయని విద్యాశాఖాధికారులు ప్రకటించారు. పాఠశాలల వారీగా హెచ్ఎం లాగిన్‌తో పాటు విద్యార్థులు ఇదే వెబ్‌సైట్ నుంచి నేరుగా హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. టెన్త్ పరీక్షలకు జిల్లాలో 31,291 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల ఇన్విజిలేషన్ విధుల్లో ఉన్న ఉపాధ్యాయులను సోమవారం రిలీవ్ చేసి, పాఠశాలలకు పంపాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదేశాలు జారీ చేసినట్లు డీఈవో పి.శైలజ ఆదివారం తెలిపారు. కాగా ప్రవీణ్ ప్రకాష్ ఆదేశాలతో ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని ఇంటర్మీడియెట్ విద్య ఉన్నతాధికారులు చీఫ్ సూపరింటెండెంట్‌లకు ఆదేశాలు ఇచ్చారు.

హామీలన్నీ నెరవేర్చిన సీఎం జగన్



బల్లికురవలో ఇంటి హక్కుపత్రం అందజేస్తున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

పేదల సొంతింటి కల నెరవేర్చారు

- దోచుకోవడం.. దాచుకోవడం తప్ప చంద్రబాబు చేసిందేమీ లేదు
- వైఎస్సార్ సీపీ అద్దంకి సమన్వయకర్త చిన హనిమిరెడ్డి
- బల్లికురవలో 297 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ



హాజరైన లబ్ధిదారులు

బల్లికురవ: మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు సిద్ధం అవుతున్నారని వైఎస్సార్ సీపీ అద్దంకి సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఆదివారం బల్లికురవలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లలో భాగంగా 297 మందికి రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేశారు. చిన హనిమిరెడ్డి మాట్లాడుతూ ప్రజాసంకల్ప యాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకున్న సీఎం జగనన్న రాష్ట్రంలోని 31 లక్షల మందికి నివేశన స్థలాలు ఇవ్వడమే కాకుండా జగనన్న కాలనీల్లో లేఅవుట్‌ల ద్వారా ఇళ్ల నిర్మాణంతోపాటు మౌలిక వసతులు కల్పించారన్నారు. ఇచ్చిన స్థలానికి పూర్తి హక్కు కల్పించటం ఓ వరం అన్నారు. చరిత్రలో ఏ ముఖ్యమంత్రి ఇలా చేయలేదని.. చంద్రబాబు ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌ల మాయమాటలు ప్రజలు నమ్మవద్దన్నారు. 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఒక్కటైనా చెప్పుకోదగ్గ పని చేశారా అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ కుల, మత, పార్టీలకు అతీతంగా సచివాలయ వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను అర్హులందరికీ నేరుగా బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ చేయటం వల్లే లబ్ధిదారులంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఇక్కడ హ్యాట్రిక్ కొట్టానని గొప్పలు చెప్పుకునే ఎమ్మెల్యే దోచుకోవటం, దాచుకోవటం మినహా అభివృద్ధి చేయలేదన్నారు. 2019లో జగనన్న సీఎంగా బాధ్యతలు చేపట్టాకే అద్దంకి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అద్దంకిని రాష్ట్రంలోనే అగ్రభాగంలో ఉంచేందుకు ఎమ్మెల్యేగా తనను ఓటుతో ఆశీర్వదించాలన్నారు. తహసీల్దార్ ఎం.సుభద్ర, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు ఇప్పల అయ్యప్పరెడ్డి, వల్లాపల్లి, కె.రాజుపాలెం సొసైటీల అధ్యక్షులు మంచాల శ్రీనివాసరెడ్డి, ఒంగోలు సుబ్బారావు, పార్టీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అంజనీ ప్రసాదరెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ శ్రీనువలి, స్థానిక నేతలు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



స్వర్ణలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న సమన్వయకర్త యడం బాలాజీ

మహిళలను లక్షాధికారులను చేసిన జగనన్న

- వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ
- స్వర్ణ గ్రామంలో 1200 మంది లబ్ధిదారులకు పట్టాల పంపిణీ

స్వర్ణ (కారంచేడు): రాష్ట్రంలోని పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండలంలోని స్వర్ణ గ్రామంలో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామానికి మొట్టమొదటి సారిగా వచ్చిన బాలాజీకి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయని, మేము పేద ప్రజలకు అదిచేస్తాం.. ఇది చేస్తామని గొప్పలు చెప్పుకొని పాలకుల్లో ఒక్కరైనా పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చేలా చర్యలు తీసుకున్నారా? అని ప్రశ్నించారు. సీఎం జగనన్న పాలనలోనే పేద మహిళలకు ఇంటి స్థలాన్ని వారి పేరు మీద రిజిస్టర్ చేసి పక్కా రిజిస్ట్రేషన్ పత్రాలను అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇళ్ల పట్టాలకు హక్కులు కలుగజేసి సీఎం జగన్ మహిళలను లక్షాధికారులను చేశారన్నారు. జగనన్న ప్రభుత్వం పేదల పక్షాన ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలన్నారు. పేద ప్రజలకు ఇళ్ల నిర్మాణాలతో పాటు, తాగునీటి వసతి, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ వంటి అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి, ఊర్లకు ఊళ్లనే కడుతున్నారన్నారు. ప్రజలకు మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించేందుకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆరోగ్య శ్రీ నగదు పరిమితిని రూ.25 లక్షలకు పెంచారన్నారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణాలు ఎంతో వేగంగా జరిగాయన్నారు. అనంతరం కొడవలివారిపాలెంకు చెందిన 135 మందికి, కుంకలమర్రు–262, కారంచేడు–267, స్వర్ణ–252, కేశవరప్పాడు–37, ఆదిపూడి–100, దగ్గుబాడులో 122 మంది లబ్ధిదారులకు పట్టాలు అందించారు. జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీ శ్రీనివాసరావు, గ్రామ సర్పంచి మోటాని మధుసూదనరావు, ఎంపీటీసీ కట్టా బాబు, మండల కో–ఆప్షన్ మెంబర్ ముల్లా నూర్‌అహ్మద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండా చౌదరిబాబు, జేసీఎస్ కన్వీనర్ యార్లగడ్డ శ్రీకాంత్, యార్లగడ్డ పాపారావు, కొడాలి ధర్మానందరావు, పులి గంగరాజు, మాదాసు సుబ్బారావు, కారుమూడి సుబ్బారెడ్డి, గుమ్మడి రామ్మోనరావు, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోకి మద్యం, నగదు రాకుండా పటిష్ట చర్యలు

పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



నరసరావుపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రంలోకి అక్రమంగా మద్యం, నగదు, గంజాయి, నాటు సారా లాంటి నిషేధితమైనవి రాకుండా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం పల్నాడు జిల్లాలోని అంతర్ రాష్ట్ర పులిచింతల చెక్‌పోస్టు, మాదిపాడు, పుట్లగూడెం బల్లకట్టులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తెలంగాణ రాష్ట్రం నుంచి పల్నాడు జిల్లాలోకి మద్యం, నగదు ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకునేందుకు పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఇందులో భాగంగా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి పులిచింతల చెక్‌పోస్టు వద్ద ఆకస్మికంగా తనిఖీ చేసి, సిబ్బంది పనితీరును పరిశీలించి వారికి దిశానిర్దేశం చేశారు. పుట్లగూడెం, మాదిపాడు బల్లకట్టులను సందర్శించి బల్లకట్టు యజమానులతో మాట్లాడి బల్లకట్టులపై మద్యం, నగదు అక్రమ రవాణా జరగకుండా చూసుకోవాలని, వాటిపై అక్రమంగా రవాణా చేస్తూ మద్యం, నగదు దొరికితే బల్లకట్టు సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. బోర్డర్ చెక్‌పోస్టు, అంతరాష్ట్ర చెక్‌పోస్టుల ద్వారా వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేసేటప్పుడు వాహన డ్రైవర్లు, యజమానులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, ప్రతి చెక్‌పోస్టు వద్ద పోలీస్ సిబ్బంది, అధికారులచే నిత్యం వాహనాలను ఆపి పరిశీలిస్తూ నిషేధితమైనవి అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న పోలీసులు, సిబ్బందిని ఆదేశించారు. మాదిపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శృంగేరిపీఠంకు చెందిన వేద వేదాంత గురుకుల మహా విద్యాలయాన్ని ఎస్పీ సందర్శించారు.

అమరేశ్వరా.. నమోనమః

- రేపటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- సిద్ధమైన అమరేశ్వరాలయం




తాటాకు పందిళ్లతో సిద్ధమైన కల్యాణమండపం



క్యూలైన్ల ఏర్పాటు

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామివారి దేవస్థానంలో ఈనెల 5వతేదీ నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి సోమవారం వివరించారు. ఉత్సవాలలో సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం ఏర్పరుచుకుని ఉత్సవాల ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామన్నారు.

- మార్చి 8,9 తేదీలలో నిర్వహించే శివరాత్రి ఉత్సవాలలో భక్తులు అమరావతి చేరుకోవటానికి ఆర్టీసీ గుంటూరు, సత్తెనపల్లి, మంగళగిరి విజయవాడల నుంచి సుమారు 60బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.
- ఉత్సవాలలో ప్రధానంగా 8వతేదీ కల్యాణోత్సవం , 10వతేదీ స్వామివారి దివ్య రథోత్సవం రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ సహకారంతో సుమారు 300 మంది సిబ్బందిని వినియోగిస్తున్నట్లు తెలిపారు.
- దేవాలయంలో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశామని, అత్యవసర పరిస్థితులలో ఉపయోగించేందుకు 60 కేవీ జనరేటర్‌ను ఏర్పాటు చేశామన్నారు.
- దేవాలయంలో పారిశుధ్య నిర్వహణకు తగినంత ప్రత్యేక సిబ్బందిని నియమించామని, కృష్ణానది ఒడ్డున తాత్కాలికంగా దుస్తులు మార్చుకునే గదులను ఏర్పాటు చేశామన్నారు.



విశేషాలంకారంలో అమరేశ్వరుడు

- స్వామివారిని దర్శించుకునేందుకు, భక్తులు దేవాలయంలోకి వెళ్లేందుకు, అభిషేకానికి, ప్రత్యేక దర్శనానికి, ఉచిత దర్శనానికి వేర్వేరుగా క్యూలైన్లను ఏర్పాటు చేశామన్నారు. ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లలో భక్తులకు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. క్యూలైన్లు సక్రమంగా నడిచేందుకు స్థానిక ఆర్‌వీవీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థుల సేవలను ఉపయోగించుకుంటామన్నారు.
- స్వామివారి ప్రసాదాన్ని విక్రయించేందుకు దేవాలయ ప్రాంగణంలో నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.
- బ్రహ్మోత్సవాలలో భక్తుల సౌకర్యార్థం జిల్లాలోని వివిధ దేవాలయాల నుంచి సిబ్బందిని డిప్యూటేషన్ మీద నియమించామని, ముందు జాగ్రత్త చర్యగా అగ్నిమాపక సిబ్బంది సేవలను కూడా వినియోగించుకుంటున్నామన్నారు.
- నదిలో భక్తులు స్నానం చేయటానికి నీరులేక పోవటంతో భక్తులు పుణ్యస్నానాలాచరించటానికి ప్రత్యేకంగా షవర్లు ఏర్పాటు చేశామన్నారు. స్వామివారి రథోత్సవం నిర్వహించేటప్పుడు ప్రత్యేక ఏర్పాట్లతో పాటు రథాన్ని, ఇతర వాహనాలకు రంగులు వేసి ఉత్సవాలకు సిద్ధం చేస్తున్నామన్నారు.
- దేవాలయానికి విచ్చేసిన భక్తులందరికీ ఉచిత ప్రసాదాన్ని అందించటానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

‘పల్స్ పోలియో’ విజయవంతం



గుంటూరులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి విడదల రజిని, మేయర్ కావటి

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు మెడికల్: పోలియో వ్యాధిని నిర్మూలించేందుకు ఐదేళ్ల పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పల్స్ పోలియో డే సందర్భంగా గుంటూరు ఆర్.అగ్రహారంలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పోలియో చుక్కలను వేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ భయంకరమైన పోలియో వ్యాధిని నిర్మూలించేందుకు దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా పోలియో చుక్కల కార్యక్రమం జిల్లావ్యాప్తంగా విజయవంతంగా చేపట్టామన్నారు. జిల్లాలో ఐదు సంవత్సరాల లోపు పిల్లలు 2,12,027 మంది వున్నట్లు గుర్తించామన్నారు. వారందరికీ నూరుశాతం పోలియో చుక్కలు వేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా 950 బూత్‌లు, 92 మొబైల్ టీములు, 3,612 మంది వ్యాక్సినేటర్లను వినియోగిస్తున్నా మన్నారు. మార్చి 3వ తేదీన పోలియో చుక్కలు వేయించుకోని పిల్లలను గుర్తించి ఇంటింటికి వెళ్లి మరుసటి రెండురోజుల పాటు పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు. మార్చి 6వ తేదీన మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంటింటికి వెళ్లి తప్పిపోయిన పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేస్తారన్నారు. స్టేట్ నోడల్ ఆఫీసర్ జె.విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కేవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

- గుంటూరు శ్రీనివాసరావుపేట యూపీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

పల్స్ పోలియో 97.46 శాతం..

జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో 97.46 శాతం మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఐదేళ్లలోపు పిల్లలు 2,12,027 మందికి గాను 2,06,612 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామన్నారు. మిగిలిన చిన్నారులకు వైద్య సిబ్బంది రెండు రోజులపాటు ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తారని వెల్లడించారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తజన సందడి





ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో భక్తుల కోలాహలం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఇంద్రకీలాద్రికి తరలి వచ్చి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నవ వధూవరులు పెళ్లి దుస్తులపై అమ్మవారి దర్శనానికి విచ్చేయగా, ఆలయ అధికారాలు వారికి ఉచితంగా అంతరాలయ దర్శనాన్ని కల్పించారు. ఆదిదంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. భక్తుల రద్దీ నేపథ్యం, వీఐపీల తాకిడి కనిపించడంతో దుర్గగుడి ఘాట్‌రోడ్డుపై పలు మార్లు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వదర్శనం, రూ.100, రూ.300, రూ. 500 టికెటు క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు ఇబ్బంది పడకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. అంతరాలయం క్యూలైన్ త్వరత్వరగా ముందుకు కదిలేలా చూడటంతో పాటు రూ. 300 టికెటు తీసుకున్న భక్తులకు ముఖ మండప దర్శనానికి అనుమతించారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు.

ఆర్ట్ ఫెస్ట్‌లో శ్రీనివాసరెడ్డికి గోల్డ్ మెడల్



వడ్డాది పాపయ్య పెయింటింగ్



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న శ్రీనివాసరెడ్డి

చినగంజాం: గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలో నిర్వహించిన వన్‌డే ఆర్ట్ ఫెస్ట్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలలో చినగంజాంకు చెందిన సూరిన శ్రీనివాసరెడ్డి గోల్డ్ మెడల్ దక్కించుకున్నారు. మార్చి 2వ తేదీ కేఎల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో నిర్వహించిన బహుమతుల ప్రదాన కార్యక్రమంలో ఆయనకు గోల్డ్‌మెడల్‌ను అందజేశారు. వడ్డాది పాపయ్య పెయింటింగ్‌ను చిత్రీకరించి ఎగ్జిబిషన్‌లో ఆయన ప్రదర్శించడంతో ఆయనకు ఈ గౌరవం దక్కింది.

క్లుప్తంగా

జాతీయ కరాటే పోటీల్లో చిన్నారుల ప్రతిభ



వేటపాలెం: జాతీయస్థాయిలో నిర్వహించిన కరాటే పోటీల్లో ప్రతిభ కనబరచి చిన్నారులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ వీ బ్రహ్మానాయుడు ఆదివారం తెలిపారు. చిలకలూరిపేటలోని వాసవీ గార్డెన్ మోడరన్ షాపింగ్ మాల్‌లో షోటోకాన్ కరాటే ఆధ్వర్యంలో నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. కటాస్ విభాగంలో ఎస్‌కే రోషన్, వీ హితీష్, బీ వెంకటసాయి చరణ్ బంగారు పతకాలు సాధించారు. బీ జాన్‌రోనాల్డ్, ఎస్ పార్థసారథి, పి గౌతమ్, ఏ యశ్వంత్, ఎస్ చైతన్య వెండి పతకాలు సాధించారు. ఎస్.వరుణ్‌సాయి, హైమంత్ సాయి, బి.వెంకట సాయిచరణ్ కుమిటే విభాగంలో రజత పతకాలు సాధించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అద్దంకి: బైకును లారీఢీ కొట్టిన ఘటనలో యువకుడు మృతి ఘటన పట్టణంలోని పాత పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు... పట్టణంలోని గాజులపాలేనికి చెందిన సుబ్బారావు కుమారుడు తంగా విజయ్ (28) ఇంటి నుంచి మేదరమెట్ల- నార్కెట్‌పల్లి రహదారిలో బైకుపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఒంగోలు వైపు నుంచి శింగరకొండ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో విజయ్ లారీ టైరు కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు ఒంగోలులోని ఓ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. మృతుడికి వివాహం కాలేదు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

- నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి
- బల్లికురవలో పార్టీ కార్యాలయం ప్రారంభం

బల్లికురవ: వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని, ప్రజల ఆదరణ రోజురోజుకు పెరుగుతోందని పార్టీ అద్దంకి సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి సంతమాగులూరు వెళ్లే రోడ్డులో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. చిన హనిమిరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే జగనన్న రెండోసారి సీఎం కావడం, తాను ఎమ్మెల్యేగా అవడం ఖాయమని చెప్పారు. బల్లికురవలో వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభంలో భాగంగా అద్దంకి సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి 4 కిలోమీటర్లు బైకు నడిపి యువతను ఉత్తేజపరిచారు. పార్టీ కార్యాలయం ప్రారంభం తదుపరి సంతమాగులూరు వెళ్లే రోడ్డులో భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఈర్లగంగమ్మ ఆలయాన్ని సందర్శించి గంగమ్మ ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, బల్లికురవ ఎంపీటీసీ టి.రాహేలు, జేసీఎస్ అధ్యక్షుడు టి.నరేష్, మండల ఇన్‌చార్జి డీ బ్రహ్మారెడ్డి, వల్లాపల్లి, కె.రాజుపాలెం సొసైటీల అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరెడ్డి, ఒంగోలు సుబ్బారావు, స్థానిక నేతలు చింతల శ్రీనివాసరావు, పావులూరి చందు, ఏల్చూరి రవీంద్ర, మద్దినేని అశోక్ పాల్గొన్నారు.



బల్లికురవలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చిన హనిమిరెడ్డి

నోడల్ అధికారులు విస్తృతంగా పర్యటించాలి

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు
- డీఎస్పీలు, సీఐలతో ఏఎస్పీ రమణమూర్తి

నగరంపాలెం: సార్వత్రిక ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో నోడల్ అధికారులు విస్తృతంగా పర్యటించాలని ఏఎస్పీ (పరిపాలన) జీవీ రమణమూర్తి అన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు నోడల్ అధికారులుగా ఉన్న పోలీస్ అధికారులతో ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మకమైన గ్రామాలను, పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టిసారించాలని చెప్పారు. గతంలో జరిగిన హింసాత్మక ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకునేందుకు అనుసరించాల్సిన అంశాలను సేకరించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నోడల్ అధికారులు ఇతర ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో విధులు సమర్థంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఎస్పీలు మహబూబ్‌బాషా (దక్షిణ), మహేష్ (పశ్చిమ), రవికాంత్ (ఉత్తర), రమేష్ బాబు (తెనాలి), సీఐలు నరేష్‌కుమార్, అన్వర్‌బాషా, వెంకటేశ్వరరావు, నిస్సార్ బాషా, శ్రీనివాసరావు, బిలాలుద్దీన్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



నోడల్ అధికారులతో చర్చిస్తున్న ఏఎస్పీ రమణమూర్తి

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు అక్స ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): పట్టణానికి చెందిన ఎం.అక్స ఈ నెల 29న నోయిడాలో జరగనున్న జాతీయ సబ్ జూనియర్స్ బాక్సింగ్ పోటీలకు ఎంపికై నట్లు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొసనా వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన అక్స బంగారు పతకం, పి.కీర్తి, కె.జీవిత, కె.లాస్య కాంస్య పతకాలు సాధించారని పేర్కొన్నారు. పోటీలకు మేనేజర్‌గా పీఈడీ డి.సరళాదేవి వ్యవహరించారని తెలిపారు.

ఏప్రిల్ 21న ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

క్రోసూరు: క్రోసూరు ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21వ తేదీ నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ సుజన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదివే విద్యార్థులు అర్హులని తెలిపారు. ఓసీ ,బీసీ విద్యార్థులు 1-09-2012 నుంచి 31-08-2014 తేదీలోగా పుట్టిన వారై ఉండాలి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01-09-2010 నుంచి 31-08-2014 మధ్య పుట్టి ఉండాలన్నారు. వివరాలకు 9441214 607, 7981486082, 9182730803 సంప్రదించాలని కోరారు.

భారతీయ తపాల ఉద్యోగుల సంఘం డివిజన్ కార్యవర్గం ఎన్నిక

నగరంపాలెం: ఏపీ సర్కిల్ పరిధిలో 17వ డివిజన్ కార్యవర్గాన్ని నెలకొల్పడం శుభపరిణామమని భారతీయ తపాల ఉద్యోగుల సంఘం (బీపీఈఏ) రాష్ట్ర సర్కిల్ కన్వీనర్ పి.వీరవసంతరావు అన్నారు. అరండల్ పేట ప్రధాన తంతి తపాల కార్యాలయంలో ఆదివారం బీపీఈఏ గుంటూరు డివిజన్ నూతన కార్యవర్గం (పోస్ట్ మ్యాన్/ఎంటీఎస్) ఎన్నికైంది. సర్కిల్ అధ్యక్షుడు జి.బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి వీరవసంతరావు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన పోస్టల్ ఉద్యోగులకు పెన్షన్ సాధించిన ఘనత తపాల ఉద్యోగుల సంఘానిదేనని తెలిపారు. డివిజన్ అధ్యక్షుడిగా ఎం.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా జి.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ మురళీకృష్ణ, కోశాధికారిగా కె.బాలకృష్ణ, కార్యదర్శిగా పి.ఆదిశేషు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీరవసంతరావు

ప్రకృతి ఉత్పత్తులకు భలే డిమాండ్

- యూఎస్ఏ ఫ్యాషన్ క్రాఫ్‌సంస్థ సీఈఓ మెర్సీ జారోఫ్
- వాణిజ్యంపంటలను ప్రకృతి విధానంలో సాగు చేయండి
- యడ్లపాడు మండలం కొత్తపాలెం గ్రామ సందర్శన



ప్రకృతి విధానంతో సాగైన కూరగాయ పంటల్ని పరిశీలిస్తున్న బృందం

యడ్లపాడు: ప్రకృతి పద్ధతుల ద్వారా సాగు చేసిన ఉత్పత్తులకు స్థానికంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందని అమెరికాకు చెందిన మెర్సీజారోఫ్ చెప్పారు. యూఎస్ఏకు చెందిన ఫ్యాషన్ క్రాఫ్ సంస్థ సీఈఓ మెర్సీజారోఫ్ తో పాటు ఏపీ రైతుసాధికార సంస్థ ప్రతినిధుల బృందం సభ్యులు ఆదివారంకొత్తపాలేన్ని సందర్శించారు. గ్రామం పరిధిలో ప్రకృతి విధానంతో సాగవుతున్న వివిధ క్షేత్రాలను బృందం స్థానిక రైతులతో కసి పరిశీలించింది. తొలుత ప్రకృతి సాగు విధానంలో తొమ్మిది సార్వత్రిక సూత్రాలను తెలిపే చక్రం రూపకల్పన చేసి ప్రదర్శించారు. విత్తన శుద్ధి, విత్తన గుళికలు చేయడం, ఘన, జీవామృతాల తయారీ వంటి వాటిని రైతులు బృందానికి చేసి చూపించారు. అనంతరం ప్రకృతి విధానంతో సాగు చేస్తున్న ఆహార, వాణిజ్య పంటలను పరిశీలించారు. సమీపంలో ఉన్న రసాయనిక విధానంతో సాగైన క్షేత్రాలకు, ప్రకృతి సేద్యాలకు మధ్య వ్యత్యాసాలను చూపించి వివరించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలు, గ్రామైక్య సంఘాల లీడర్లు, ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులతో ప్రకృతి సేద్యం, వారు అనుసరిస్తున్న పద్ధతులు, వాటి మార్కెటింగ్, ప్రయోజనాలు వంటి వాటిపై బృందం చర్చించారు. ఈ సందర్భంగా మెర్సీజారోఫ్ మాట్లాడుతూ ఈ విధానంతో సాగు చేస్తున్న రైతులు కేవలం ఆహార ఉత్పత్తులే కాకుండా.. మనం నిత్యం వినియోగించే వస్తు తయారీ సంబంధిత పంటలపై దృష్టిని సారిస్తే మరిన్ని ప్రయోజనాలు పొందే అవకాశం ఉన్నాయన్నారు. ఉదాహరణకు ప్రకృతి ద్వారా పండించిన ఆహారంతో ఆరోగ్యంగా ఉన్నప్పటికీ రసాయనాలతో సాగైన పత్తి ఆధారిత దుస్తులను ధరించడంతో కొన్ని చర్మ ఇతర అనారోగ్య సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. కాబట్టి ప్రకృతి విధానంతో పత్తి సాగు చేస్తే ప్రపంచ మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉందని భవిష్యత్తులో ఆర్థికంగా వృద్ధి సాధించవచ్చని తెలిపారు. ఆ దిశగా తమ పంటలను ఆహారంతో పాటు వాణిజ్యంలోనూ ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఏపీ రైతు సాధికార సంస్థ(ఆర్‌వైఎస్ఎస్) మార్కెటింగ్ విభాగం సీఎల్ ప్రభాకర్ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం రైతు సాధికార సంస్థ ద్వారా ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేసిందని వివరించారు. ఏపీ రాష్ట్రాన్ని మోడల్‌గా తీసుకుని దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు పలు దేశాలు ఒడంబడిక చేసుకుని ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. 365 రోజులు భూమి పచ్చదనంతో రసాయన, కృత్రిమ ఎరువుల వినియోగం మాని, హైబ్రీడ్ రకాల్ని వీడి దేశీయ విత్తనాల వాడకం, పశువుల అనుసంధానం, జీవ ఉత్ప్రేరకాలను వినియోగించడం, సాగుకు ముందు విత్తనశుద్ధి, గుళికలు, ఘన, జీవామృతాలవంటి కషాయాల తయారీ క్షేత్రస్థాయిలోనే తయారు చేసుకునేలా ప్రభుత్వం పూర్తిస్థాయి శిక్షణ ఇస్తుందన్నారు. అలాగే ప్రత్తిలో నాణ్యత, దిగుబడి పెరిగి అంతర్జాతీయ మార్కెట్లో మంచి ధరపొందే వీలుందన్నారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ట్రైనీ కలెక్టర్ సంజన సింహ, ఆర్‌వైఎస్ఎస్ పీఓ హర్ష, స్టేట్ రీజనల్ కోఆర్డినేటర్ ఎన్.వెంకట్రావు, పల్నాడు జిల్లా డీపీఎం కె.అమలకుమారి, ప్రొడ్యూసర్ ట్రస్ట్ స్మిత, మార్కెటింగ్ ప్రాజెక్టు మేనేజర్ బాజి, ఏడీపీఎం ప్రేమ్‌రాజ్, ఏపీఎం జీవన్ పాల్గొన్నారు.

బంగారు తల్లి కార్డులపై అవగాహన ఉండాలి

జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: బంగారు తల్లి(హిమోగ్లోబిన్ ప్రోగ్రెస్ కార్డు)పై పిల్లల తల్లిదండ్రులలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. భువనచంద్ర టౌన్ హాలులో విద్యాశాఖ ఆధ్వర్యంలో డీఎల్‌డీఓ, మండల విద్యా శాఖాధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ప్రధానోపాధ్యాయులు, మహిళా శిశు సంక్షేమ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్డులలో వివరాలు పూర్తిగా ఎప్పటికప్పుడు బ్లడ్ గ్రూపుతో సహా నమోదు చేయాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ కార్యదర్శులు రక్తహీనత తక్కువగా ఉన్న పిల్లల తల్లులతో ప్రత్యేకంగా సమావేశమై కార్డు వివరాలు, పోషక ఆహారం అందించే విషయంలో అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి విద్యార్థినికి ప్రోగ్రెస్ కార్డు జెరాక్స్ కాపీ అందజేయాలని సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ప్రోగ్రెస్ కార్డులపై ప్రధానోపాధ్యాయులకు మహిళా శిశు సంక్షేమ కార్యదర్శులకు మార్గనిర్దేశం చేశారు. తద్వారా పిల్లల తల్లిదండ్రులకు రక్తహీనతపై వివరాలు అందుతాయని అభిప్రాయపడ్డారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి బి.రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

విద్యతో పాటు క్రీడలు అవసరం

జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట రూరల్: సాంకేతిక విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైనవని జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల జాతీయ స్థాయి క్రీడా, సాంకేతికోత్సవం ముగింపు వేడుకలు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా చురుగ్గా పాల్గొనాలని తెలిపారు. విద్యార్థి దశ నుంచి క్రీడల్లో పాల్గొనడం వలన మానసిక ఉల్లాసం పెంపొంది చదువులో రాణించవచ్చని పేర్కొన్నారు. మేధ, సృజనాత్మకతలను తమ ఆధీనంలో ఉంచుకొని సమయానుకూలంగా ఉపయోగించుకునేందుకు క్రీడలు దోహదం చేస్తాయని తెలిపారు. వ్యక్తిగతైన, వృత్తిపరమైన విలువలను ఆధారం చేసుకునే మన జీవితం పయనిస్తుందని, ఈ విలువలు విద్య ద్వారా మనం నేర్చుకోవచ్చన్నారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, పొడా చైర్మన్, కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, పొడా చైర్మన్ రమేష్‌బాబు

కాలువలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- తప్పిన పెను ప్రమాదం
- ప్రయాణికులు క్షేమం

పర్చూరు(చినగంజాం): ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కన ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈఘటన ఆదివారం మండలంలోని చిన నందిపాడు గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పర్చూరు నుంచి గుంటూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మండలంలోని చిననందిపాడు వద్ద టీ జంక్షన్ ప్రాంతంలో రోడ్డు మధ్యకు వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి రోడ్డు నక్కన ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్సులో 22 మంది ప్రయాణికులుండగా ఇరువురు వృద్ధ మహిళలు వలివేటి రమాదేవి, పోలిశెట్టి సుబ్బాయమ్మలకు స్వల్పగాయాలయ్యాయి. బస్సులో ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలానికి ఎస్ఐ రమేష్ చేరుకొని పరిశీలించారు. గాయాలపాలైన వారిని 108 వాహనంలో పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాలువలోకి వెళ్లిన బస్సును బయటకు తీసి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశామని, ఆస్పత్రి సమాచారం అనంతరం కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.



పంట కాలువలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

మహిళ ఆత్మహత్యాయత్నం

కొల్లూరు: ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. కేటీ కాలనీకి చెందిన కల్లూరి ప్రియాంక కొన్నేళ్ల నుంచి క్రాపకు చెందిన గుడిపూడి కిరణ్‌తో సహజీవనం చేస్తోంది. అతడికి వివాహం అయిన అనంతరం ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో మూడు నెలల క్రితం పెద్దల నడుమ పంచాయితీ చేసుకున్నారు. అయితే కొద్ది రోజులుగా ప్రియాంక తన ఇద్దరు పిల్లలను తన తల్లి వద్ద ఉంచి ఇతర ప్రాంతంలో ఉంటున్న తన పిన్ని వద్ద ఉంటూ జీవనం సాగిస్తోంది. అయితే గత మంగళవారం గతంలో ఆమెతో సహజీవనం చేసిన ఆమె ఇంటికి వెళ్లి కిరణ్ భార్య శిరీష ఇంటిలోకి ప్రవేశించి సామగ్రిని ధ్వంసం చేస్తుండడంతో సమీపంలో నివసించే ప్రియాంక తల్లి వెళ్లి ఆమెను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో తన భర్తను నీ కుమార్తె తీసుకువెళ్లిందంటూ ఆమెపై దాడి చేసింది. ఘటనపై మంగళవారం బాధితులు కొల్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే కేసు విచారణ చేపట్టిన పోలీసులు ఇరు సామాజిక వర్గాల పెద్దల సమక్షంలో చర్చలు జరిపారు. తన ఇంటిపై దాడి చేసి సామగ్రిని ధ్వంసం చేసినప్పటికీ పోలీసులు నిర్లక్ష్యం చేస్తూ, తనకు న్యాయం చేయడం లేదన్న మనస్తాపంతో కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలుపుకుని తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శిరీషపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు.



చికిత్స పొందుతున్న ప్రియాంక

విశ్వాసఘాతకులను ఓడించండి

సత్తెనపల్లి: విశ్వాస ఘాతకులను ఓడించాలని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి విధేయులమైన నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్, తనను గెలిపించాలని కోరారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండల పరిధిలోని ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీలో రూ.46 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్, ధూళిపాళ్లలో రూ.1 .78 కోట్లతో నిర్మించిన సిమెంట్ రోడ్లు అదే విధంగా కంకణాలపల్లిలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.23.98 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం.. రూ.2.87 కోట్ల అభివృద్ధి పనులను ఆయన మాజీ మంత్రి, నరసరావుపేట పార్లమెంట్ సమన్వయకర్త డాక్టర్ అనిల్ కుమార్ యాదవ్‌తో కలసి ఆదివారం రాత్రి ప్రారంభించారు. కార్యక్రమానికి పార్టీ సత్తెనపల్లి మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామం అంతా జనసంద్రమైందని, అన్ని వర్గాల నుంచి జగన్‌మోహన్ రెడ్డిపై ప్రేమ ఉందని, ఇదే ఆదరణ కొనసాగించి ధూళిపాళ్లలో వెయ్యి ఓట్ల మెజార్టీ వచ్చేలా కృషి చేయాలన్నారు. బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ద్వారా జనసేన పార్టీని పెట్టించింది చంద్రబాబునాయుడేనని, వారి లక్ష్యం ఒకటేనన్నారు. జగన్‌మోహన్ రెడ్డి నుంచి కాపు ఓట్లను చీల్చి ఆయనను ఓడించడమే ధ్యేయంగా వారు పని చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి చంద్రబాబు నాయుడు అక్కసుతో విమర్శిస్తున్నాడన్నారు. అభివృద్ధి అంటే చంద్రబాబు దృష్టిలో తను వ్యక్తిగతంగా రూ.వెయ్యి కోట్లో, లక్ష కోట్లో దోచుకోవడమేనని విమర్శించారు. చంద్ర బాబు నాయుడు చేసిన దోపిడీ పవన్ కళ్యాణ్ ఏనాడు విమర్శించలేదని పేర్కొన్నారు. నెల్లూరు మాజీమంత్రి, నరసరావుపేట సమన్వయకర్త పి.అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ 'చంద్రబాబు నువ్వు చెప్పినట్టు నేను గాని పల్నాడు జిల్లాలో ఓడిపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటా... నేను గెలిస్తే నువ్వు కానీ, నీ కొడుకు కానీ నా చాలెంజ్‌ని స్వీకరించి రాజకీయాల నుంచి తప్పుకుంటారా' అని ప్రశ్నించారు. గురజాల నియోజకవర్గంలో జరిగిన సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ గంజాయి వనం నుంచి తులసి వనంలోకి వస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకి స్వాగతం అన్నారని, అయితే అదే అభ్యర్థికి వైఎస్సార్ సీపీలో నరసరావుపేట సీటు కేటాయిస్తే ఇక్కడే పోటీ చేసేవాడు కదా అన్నారు. తాము కాదన్న వ్యక్తి, మా పార్టీని కాదనుకొని స్వార్థంతో నీ గడప తొక్కిన వ్యక్తి ఎలా తులసి మొక్క అయ్యాడని ప్రశ్నించారు. 2019లో ఎవరు తనకంటే ముందే హైదరాబాద్ పారిపోయాడని చంద్రబాబు నాయుడు నుద్దేశించి దుయ్యబట్టారు. బుల్లెట్ దిగిందా అని ప్రశ్నించావుగా చంద్రబాబు నాయుడు .. నెల్లూరులోనే కాదు మీ పార్టీకి నరసరావుపేట పార్లమెంట్‌లో కూడా బుల్లెట్ దింపుతానని హెచ్చరించారు. బడుగులకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహసంతి, నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కల్లం విజయ భాస్కరరెడ్డి, ఎంపీపీ ఎలవర్తిపాటి సేక్ జైబున్‌బీ, సత్తెనపల్లి, రాజుపాలెం జడ్పీటీసీలు సంకటి నాగేశ్వరమ్మ, సునితారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, ధూళిపాళ్ల ది ఆంధ్రబ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివనారాయణ పాల్గొన్నారు.



ప్రత్యేక వాహనంపై నుంచి బాణం వేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ఆరు రేస్ బైక్‌లు స్వాధీనం

రేస్ నిర్వాహకుల పరారీ

వేటపాలెం: యువకుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ఆదివారం ఆరు రేస్ బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జీ సురేష్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. బైపాస్ రోడ్డు వద్ద నుంచి సముద్రతీర గ్రామం పొట్టి సుబ్బయ్యపాలెం వెళ్లే రోడ్డులో బైక్ రేస్ గేమ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చిందని ఎస్సై తెలిపారు. వెంటనే ఆ ప్రాంతంలో దాడులు నిర్వహించగా ఆరుగురు యువకులు రేస్‌కు ఉపయోగించే బైక్‌లను వదిలి పారిపోయారు. దీనితో అక్కడే వదిలి వెళ్లిన బైక్‌లను స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కి తరలించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

